క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఈ నెల 21 నుంచి కనిపించడం లేదని భార్య ఎండీ రుబీనా మంగళవారం వనపర్తి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. పెబ్బేరు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన నిరంజన్‌పాష వృత్తి జేసీబీ డ్రైవర్, అతని భార్య వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తోంది. ఈ నెల 21న అతని భార్య ఎండీ రుబీనాను ఉదయం ఆస్పత్రి నుంచి బైక్‌పై ఎక్కించుకొని వనపర్తి బస్టాండ్‌లో దించి కొత్తకోటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లారు. తిరిగి ఇంటికి రాలేదు. అతని ఫోన్ స్విచ్ఆఫ్ అయింది. చుట్టు పక్కల, బంధువులతో వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. అతని భార్య ఫిర్యాదు మేరకు మిసింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పిల్లలతో పాటు తల్లి అదృశ్యం

ఖిల్లాఘనపురం: మండలంలోని షాపురం గ్రామానికి చెదిన వాకిటి(పోయికాటి) రోజాతో పాటుగా ఇద్దరు పిల్లలు కనిపించక పోవడంతో భర్త వాకిటి రమేష్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిల్లాఘనపురం మండలం షాపురం గ్రామానికి చెందిన వాకిటి రమేష్‌కు 13 ఏళ్లక్రితం పోయికాటి రోజాతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు పుట్టారు. ఈ నెల 21న సెల్‌ఫోన్ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇద్దరు పిల్లలతో కలిసి ఆమె వెళ్లిపోయింది. బంధువులు, కుటుంబ సభ్యులతో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌గౌడు తెలిపారు.


పేకాట స్థావరంపై దాడి

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబాళాపురం గ్రామ శివారులోని మునీశ్వరి గుట్టలో పేకాట ఆడుతున్న 14 మందిలో ఒకరిని అదుపులోకి తీసుకున్నామని, మిగతా 13 మంది పారిపోయారని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. పక్కా సమాచారంతో పోలీస్ బృందంతో పేకాట స్థావరంపై దాడి చేశారు. నాలుగు బైక్‌లు, మొబైల్ ఫోన్, రూ. 13,500 సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ తెలిపారు. పెబ్బేరు మండలం రాంపురం గ్రామం నుంచి శ్రీ రంగాపురం మండలం కంబాళాపురం తండాకు అనుమతి లేకుండా ఇసు కను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాల్వ ఆక్రమణపై ఫిర్యాదు

పాన్‌గల్: వ్యవసాయ పొలంలోని కాల్వను ఆక్రమించుకున్న సంఘటనపై మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపారు. హెచ్‌సీ వివరాల ప్రకారం,, మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన మంగదొడ్డి సింగన్నకు చెందిన సర్వే నం. 190, 191లో సుమారు 300 పీట్ల పొడువు, 5 పీట్ల వెడల్పు కలిగిన కాల్వ ఉంది. ఈకాల్వను సమీప రైతు వంగూరి సుబ్బయ్య ఆక్రమించుకొని తన పొలంలో కలుపుకొని శిస్తు చేస్తున్నాడు. ఈ విషయంపై గతంలో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాల్వ ఆక్రమణపై సమగ్ర విచారణ చేసి కాల్వ నక్షను పరిశీలించి కాల్వ ఏర్పాటు చేయాలని సింగన్న ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

గొర్రెల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి



వీపనగండ్ల: గొర్రెల పెంపకందారులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని మంగళవారం గోవర్ధనగిరిలో గొర్రెలకాపరులు నిరసన కార్యక్రమం చేపట్టా రు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంపకందారుల హక్కులను పరిరక్షిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఆ తర్వాత తమను పట్టించుకోవడం లేదన్నారు. తమ హక్కుల సాధన కోసం బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో చేపట్టే నిరసన కార్యక్రమానికి అధిక సంఖ్యలో గొర్రెలకాపరులు పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు ముంత బిచ్చన్న, మద్గం తిరుపతి, ఈర్ల రాజు, పరమేష్, శ్రీరాములు తెలిపారు.

టీబీ నిర్ధారణ పరీక్షలు

పాన్‌గల్: మండలంలోని శాఖాపూర్ ఆరోగ్య ఉపకేంద్ర పరిధిలో మంగళవారం సమగ్ర ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర ఆరోగ్య శిబిరంలో ప్రజలకు ఉచితంగా ఎచ్ఐవీ పరీక్షలు, టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు తారా శశాంక్, నిహారిక, ఎన్‌జీఓ సిబ్బంది, ఐటీసీ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి

గోపాల్‌పేట: ఈనెల 28, 29 తేదీల్లో జరిగే సేవాలాల్ రాష్ట్రస్థాయి సామాజిక, రాజకీయ శిక్షణ తరగతులు వినియోగించుకుని విజయవంతం చేయాలని మంగళవారం సేవాలాల్‌సేన నాయకుడు తిరుపతినాయక్ పిలుపునిచ్చారు.

చెప్పుకోలేని బాధలు!



ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాత్రూం వద్ద క్యూ కట్టిన విద్యార్థినులు(ఫైల్)

- విద్యార్థులందరికీ ఒకటే బాత్రూం
- విద్యార్థుల అవస్థలు
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యల తిష్ట
- అసౌకర్యాల మధ్య ప్రారంభమైన తరగతులు

ఆత్మకూర్: వందలాదిమందికి ఒక్కటే బాత్రూం ఉండడంతో చెప్పుకోలేని బాధలతో విద్యార్థినులు సతమతమవుతున్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల కళాశాలలో, ఆత్మకూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాత్రూంలు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికి తోడు శిథిలావస్థకు చేరిన భవనాలు, ఇతర సమస్యలతో ఆందోళన చెందుతున్నారు. ఈ విద్యా సంవత్సరం జూన్ 2న కళాశాలలకు తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాదికూడా తీరని సమస్యలతోనే తరగతులకు హాజరుకావాల్సి దుస్థితి ఏర్పడడంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని వనపర్తిలో బాలుర కళాశాల, బాలికల కళాశాల, ఉర్దూ మీడియం కళాశాల, కొత్తకోట, పాన్‌గల్, పెద్దమందడి, ఖిల్లాఘనాపూర్, ఆత్మకూర్, పెబ్బేరు, శ్రీరంగాపూర్, వీపనగండ్ల, గోపాల్‌పేటలలో కళాశాలలున్నాయి, 26 గురుకుల కళాశాలలున్నాయి. ఈఏడాదైనా కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

కూలడానికి సిద్ధంగా భవనాలు..

ఆత్మకూర్‌లో 50 ఏళ్లక్రితం ఏర్పడిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఎప్పుడెప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. 2024–25 విద్యా సంవత్సరం మొదటి సంవత్సరంలో 208 మంది, ద్వితీయ సంవత్సరంలో 172 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకేషనల్ కోర్సుల్లో మొదటి సంవత్సరం 75 మంది, ద్వితీయ సంవత్సరం 60 మంది విద్యార్థులున్నారు.

కళాశాల ఆవరణలోనే హైస్కూల్..

ప్రభుత్వ కళాశాల ఆవరణలోనే హైస్కూల్ ఉండడంతో అందులో 200 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కళాశాల బాత్రూంనే హైస్కూల్ విద్యార్థులు వాడుకుంటుండడంతో వెళ్లే వాళ్లు క్యూ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కళాశాల, హైస్కూల్ విద్యార్థులకు వేర్వేరుగా బాత్రూంలు నిర్మించాల్సి ఉండగా, సంబంధిత విద్యాశాఖ అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదు. కళాశాల వెనుక బాగంలో ఆరేళ్ల క్రితం నిర్మించిన బాత్రూం వృథాగా ఉంది.

కంపౌండ్‌లోనే వరద..

కళాశాల భవనం కుంగిపోతుండడంతో వర్షపునీరు ఆవరణలో నిలిచి లోపలికి వెళ్లేందుకు విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందు భాగంలో శిథిలావస్థకు చేరిన పాత భవనం కూల్చి నూతన భవనం నిర్మిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదు. కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టి సారించి ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల వారు కోరుతున్నారు.



ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

క్యూలో నిల్చొని సిగ్గుపడుతున్నాం



వందలమంది విద్యార్థినులున్న కళాశాలలో ఒకటే బాత్రూం ఉండడంతో క్యూలో నిల్చోని సిగ్గు పడుతున్నాం. మా బాధలు పాలకులకు, అధికారులకు పట్టడం లేదు. ఇప్పటికైనా కళాశాలలో నెలకొన్న సమస్యలన్నీ పరిష్కరించాలి.

– శ్రీవల్లి, ద్వితీయ సంవత్సరం, ఆత్మకూర్

చదువు మానుకుంటున్నారు..



కళాశాలలో సౌకర్యాలు లేక సమస్యలు మిన్నకుండిపోవడంతో చాలామంది విద్యార్థినులు చదువు మానుకుంటున్నారు. బస్టాండ్‌కు ఎదురుగానే కళాశాల ఉండడంతో బాత్రూం కోసం క్యూలో నిల్చోవడంలో చాలా ఇబ్బందిగా ఉంది. కలెక్టర్, ఎమ్మెల్యే ఇక్కడి సమస్యలు పరిష్కరించాలి.

– లావణ్య, ద్వితీయ సంవత్సరం, ఆత్మకూర్

సమస్యలు నివేదించాం..



ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను గతంలోనే చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బాత్రూంలు, శిథిలావస్థకు చేరిన భవనం, ఆవరణలో చేరుతున్న నీరు, అదనపు తరగతి గదులు, ఇతర సమస్యలపై నివేదించాం. ఇదివరకే డీఐఈఓ కళాశాలను సందర్శించి పరిశీలించారు.

– భాగ్యవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూర్

వారం రోజుల్లో పరిష్కరిస్తాం..



జిల్లాలోని ఆత్మకూర్, వనపర్తి బాలికల కళాశాలల్లో బాత్రూం సమస్యలు ఉన్నాయి. ఇదివరకే సందర్శించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించాం. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తాం. జిల్లాలోని 12 కళాశాలల్లో అడ్మిషన్లు ఉధృతంగా కొనసాగుతున్నాయి. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యాబోధన చేపడుతున్నాం. విద్యార్థులను ప్రభుత్వ కళాశాల్లో చేర్పించాలి.

– అంజయ్య, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి, వనపర్తి

‘రైతుభరోసా’ సద్వినియోగం చేసుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, అధికారులు, రైతులు

కొత్తకోట రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయ పెట్టుబడిగా వేసిన రైతు భరోసా డబ్బులను సద్వినియోగం చేసుకొని, లాభసాటి పంటలు సాగు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 16న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి రైతు నేస్తం కార్యక్రమం సందర్భంగా ఇచ్చినమాట ప్రకారం రాష్ట్రంలోని రైతులందరికీ రూ.9వేల కోట్లు తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వనపర్తి జిల్లాలోని 43 రైతువేదికల్లో పాల్గొని సంబరాలు చేసుకున్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, మదనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్, రైతులు కొత్తకోట మండలంలోని అమడబాకుల గ్రామ రైతు వేదికలో పాల్గొన్నారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలోని 1,96,683 మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఇచ్చిన డబ్బులను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలు, ఎరువులతో లాభసాటి వ్యవసాయం చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, ఉద్యాన శాఖ అధికారి విజయ భాస్కర్, కొత్తకోట తహసీల్దార్ యం.వెంకటేశ్వర్లు, మదనాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, ఏఓ జాస్మిన్, టెక్నికల్ ఏఓ మాధురి పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని రైతు వేదిక, ఏదుల రైతు వేదికలో సచివాలయం నుంచి సీఎం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్షంగా వీక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం రైతుకిసాన్‌సెల్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు.

ఖిల్లాఘనపురం: మండలంలోని పర్వతాపురం, కమాలొద్దీన్‌పూర్ గ్రామాల రైతువేదికల్లో ఏర్పాటు చేసిన రైతు నేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులు, నాయకులు వీక్షించారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

త్వరగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



కడుకుంట్లలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోస్తున్న కార్యదర్శి చంద్రశేఖర్

వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్లలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ముగ్గువేసి పనులు ప్రారంభించారు. ప్రభుత్వ సూచనల మేరకు ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో తిరుపతయ్యగౌడ్, శ్రీనివాసులు, రమేష్, రాంరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేటలో ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ కార్యదర్శి ముగ్గు పోసి భూమి పూజ చేశారు. మొదటి విడతలో 32మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్వేత, కాంగ్రెస్ నాయకులు పాండురంగయ్య, వెంకట్‌రామిరెడ్డి, జితేందర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీను, శివ తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు విడుదల చేస్తున్నామని ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రేచింతల, కత్తేపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యువకులందరికీ ప్రమాద బీమా



పోస్టల్ ఇన్సూరెన్స్ చేస్తున్న సుఖేందర్‌రెడ్డి

గోపాల్‌పేట: గ్రామంలోని యువకులందరికీ ప్రమాద బీమా చేయించడం గొప్ప విషయమని ఏదుల మండల తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీఓ రాములు ఏదులకు చెందిన సుఖేందర్‌రెడ్డిని అభినందించారు. మంగళవారం ఏదుల మండల కేంద్రంలోని సుఖేందర్‌రెడ్డి తన ఇంటివద్ద మండల కేంద్రానికి చెందిన 141 మంది యువకులకు పోస్టల్ ప్రమాద బీమా చేయించారు. వనపర్తి డివిజన్ ఎస్‌పీఓ భూపన్న, ఐపీ గోపీనాథ్ ఆదేశాల మేరకు ఐపీపీబీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్ పర్యవేక్షణలో 141 మంది యువకులకు ప్రమాద బీమా చేయించారు. ఈ సందర్భంగా ఏదుల తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం వంటి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. అనంతరం సుఖేందర్‌రెడ్డి మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన మొత్తం 141 మంది యువకులకు పోస్టల్ ఇన్సూరెన్స్ ప్రమాద బీమా 565 చేయించానని ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం వస్తుందని, కుటుంబాలు రోడ్డున పడకుండా ఉండేందుకు ఇది దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ దాత కుమారులు చందన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, పోస్టల్ సిబ్బంది, మండలానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

బూటకపు హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్



సూగూరులో ప్రజలతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వనం రాములు

వనపర్తి రూరల్: బూకటకపు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పెబ్బేరు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వనం రాములు అన్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పెబ్బేరు మండలంలోని సూగూరు, యాపర్ల, కొత్త సూగూరు , వనపర్తి మండలంలోని దత్తాయిపల్లి, చందాపురం, సవాయి గూడెం గ్రామాల్లో పర్యటించారు. ప్రజలను స్థానిక ఎన్నికల కోసం సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఇచ్చిన హామీలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మాణిక్యం, మహేశ్వర్‌రెడ్డి, నరసింహ, రాము, పెబ్బేరు పట్టణ అధ్యక్షులు దిలీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సత్యారెడ్డి, కర్రెస్వామి, పెద్దింటి వెంకటేష్, రాజశేఖర్, వెంకటేష్, పరశురామ్, ఈశ్వర్, గట్టయ్య, కురుమన్న శ్రీనివాసులు, చాకలి మధు, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన విద్యార్థినులకే అడ్మిషన్లు ఇవ్వాలి

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లె శివారులోని కేజీబీవీలో అర్హులైన విద్యార్థినులకే మొదటి ప్రాధాన్యత ఇస్తూ వారికి అడ్మిషన్ ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాఘవ డిమాండ్ చేశారు.మంగళవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులతో సమస్యలు తెలుసుకున్నారు. ఆదాయం ఎక్కువగా ఉన్నవారితో పాటు తల్లిదండ్రులు ఉన్న విద్యార్థినులకు అడ్మిషన్‌లు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కేజీబీవీలో నెలకొన్న మౌలిక వసతులను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాను, ప్రకాష్, పాల్గొన్నారు.

అమెరికా సామ్రాజ్యవాదానికి పాడెకట్టాలి



వనపర్తిలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

వనపర్తి రూరల్: ఆయుధాల వ్యాపార విస్తరణ కోసం దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంపు, అమెరికా సామ్రాజ్యవాదానికి పాడెకట్టాలని సీపీఐ నేతలు విజయరాములు, గోపాలకృష్ణ, రమేష్ అన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడికి వ్యతిరేకంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్‌లో ఎర్ర జెండాలతో నిరసన తెలిపారు. అమెరికా ప్రపంచంలో యుద్ధాలను ప్రోత్సహించి మానవ వినాశనానికి పూనుకుందని విమర్శించారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోని యుద్ధాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాబర్ట్, మోషా, కుతుబ్, పృథ్వీనాదం, లక్ష్మీనారాయణ, జయమ్మ, జ్యోతి, నాగరాజు, పాషా, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆధిపత్యం చేలాయించేందుకే యుద్ధాలను ప్రోత్సహిస్తున్నారని,ఆయుధాలు అమ్ముకోవడమే వారి లక్ష్యమని సీపీఐ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి హన్మంతు, నాయకుడు ప్రసాద్ అన్నారు. గాంధీచౌక్‌లో నిరసన చేపట్టి మాట్లాడారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

వనపర్తి రూరల్: వర్షా కాలంలో సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని ఏఎల్‌ఓ టీం సభ్యులు గంధం రాజు సూచించారు. మంగళవారం డ్రై డే సందర్భంగా జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి ఆంజనేయులు ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని నాగవరంలోని బీసీ బాలుర హాస్టల్‌ను ఏఎల్‌ఓ టీం సభ్యులు సందర్శించారు. హాస్టల్ పరిసరాలు, రూమ్‌లలో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ హెల్త్‌అసిటెంట్ లక్ష్మన్, ఆశా కార్యకర్తలు బుచ్చమ్మ, రవికుమార్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూర్: మన చేతుల్లోనే మన ఆరోగ్యం ఉందని, ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, ప్రతిఒక్క రు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శశిధర్ అన్నారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా స్థానికులకు అవగాహన కల్పించారు. హాస్టళ్లలో దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడుకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు.. తప్పిన ప్రమాదం



పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో ఈదురు గాలులకు విరిగిన విద్యుత్ స్తంభం

కొత్తకోట రూరల్: ఈదురు గాలులకు రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో పెను ప్రమాదం తప్పింది. పట్టణంలోని 13వ వార్డులో ఈదురు గాలులకు కరెంట్ స్తంభం విరిగిపడినప్పుడు అటుగా వెళ్తున్న ఆటోపై విద్యుత్ వైర్లు పడ్డాయి. కాలనీలో రెండు స్తంభాలు కింద పడినప్పుడు ప్రజలు లేకపోవడంతో పాటు కరెంట్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు గాడీల ప్రశాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. పడిపోయిన స్తంభాన్ని తొలగించడంతో పాటు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

ఆత్మకూర్ అభివృద్ధికి రూ.15 కోట్లు



ఆత్మకూర్: తెలంగాణ రాష్ట్ర పశువర్ధశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆత్మకూర్ పట్టణాభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేశారని కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీనివాస్‌లు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఆత్మకూర్ మున్సిపాలిటీలోని 10 వార్డులకు గాను, వార్డుకు రూ. కోటి చొప్పున రూ.10 కోట్లు, అలాగే గాంధీచౌక్ నుంచి పీజేపీ క్యాంపు వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. వార్డుల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు అధికారులతో కలిసి పరిశీలించినట్లు వివరించారు. కార్యక్రమంలో దామోదర్, అశోక్, మహేష్, సాయిరాఘవ, యాదగిరిశెట్టి, సుదర్శన్ శెట్టి, చిన్ననర్సింహ, ఆర్మీశివ ఉన్నారు.

రైతుభరోసా రాని రైతుల నిరసన

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద రైతు భరోసా రాని రైతులు మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఒకపక్క అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా జమచేస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం గుంట, ఎకరం, రెండెకరాలు, మూడెకరాలున్న చాలా మంది రైతులకు భరోసా జమ కాలేదన్నారు. భూమి విస్తీర్ణం ఉన్న దానికన్నా తక్కువ భూమికే రైతు భరోసా జమ అవుతుండంతో రైతుల ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులకు అడిగితే టెక్నికల్ సమస్యతో జమ కావడం లేదని, తర్వాత జమ అవుతాయని పేర్కొన్నారు. ఈ విషయంపై గ్రామాల వారీగా రైతుల వివరాలను సేకరించి వారికి రైతు భరోసా జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతు భరోసా సంబరాలు



జిల్లా కేంద్రంలో సీఎం, డిప్యూటీ సీఎం, వ్యవసాయశాఖ మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త లక్కాకుల సతీష్, పట్టణ అధ్యక్షులు చీర్ల విజయచందర్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి అన్నారు. 9రోజుల్లో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమచేసే ప్రక్రియను పూర్తి కావడంతో మంగళవారం జిల్లా కేంద్రంలో రైతులతో కలిసి కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి రాజీవ్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి సీఎం చిత్రపటానికి, డిప్యూటీ సీఎం, వ్యవసాయశాఖ మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవియాదవ్, భాషానాయక్, నక్క రాములు, ఎల్ఐసీ కృష్ణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, విభూది నారాయణ, వాకిటి ఆధిత్య, గంధం కృష్ణబాబు, తదితరులు ఉన్నారు.

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా పథకంతో రాష్ట్రంలోని రైతులందరికీ తమ అకౌంట్లలో డబ్బులు జమ చేయడంతో మండల కేంద్రంలోని తిరుమలాయపల్లి చౌరస్తాలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.

అమరచింత: పట్టణంలోని రాజీవ్ గాంధీ విగ్రహం దగ్గర కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులు రైతుభరోసా సంబురాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి మిఠాయిలు తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అరుణ్, మహేందర్‌రెడ్డి, తిరుమలేష్, ఏకే వెంకటేశ్వర్‌రెడ్డి, దేవరాజ్, లక్ష్మీకాంతరెడ్డి పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ పిలుపు మేరకు కొత్తకోట చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి రైతు భరోసా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పి.కృష్ణారెడ్డి, ఎస్‌జె.బోయేజ్, డాక్టర్ పిజె.బాబు, తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని ఆగారం తదితర గ్రామాల్లో రైతు సంబరాలు నిర్వహించారు. ఖిల్లాఘనపురంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్, సాయిచరణ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆగారం ప్రకాష్, వ్యాంసుందర్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు.



కొత్తకోటలో..



అమరచింతలో..